# చుక్కల సేద్యం.. కర్షకుడికి వరం



బిందు సేద్యవిధానంలో సాగు చేసిన బొప్పాయి



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

**ప్రతి నీటి బొట్టునూ పొదుపుగా..సమర్థవంతంగా వాడుకోవడంపైనే వ్యవసాయ రంగం ఉనికి, రైతు మనుగడ ఆధారపడి ఉంది. ఈ విషయం గుర్తించిన సర్కారు సూక్ష్మసేద్యం ప్రోత్సహించాలని నిర్ణయించి, ఆ దిశగా అడుగులు వేస్తోంది. నీటి బిందువులను రైతు బంధువులుగా మార్చేలా చుక్కల,తుంపర్ల సేద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ అవకాశాన్ని అన్నదాతలు అందిపుచ్చుకుంటే వారికి వరం అవుతుంది.**

- బిందు సేద్యం పరికరాల అందజేతకు సన్నాహాలు
- ఆర్బీకేల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- చిన్న, సన్నకారు, మోతుబరి రైతులకూ ప్రయోజనం

**సైదాపురం:** కరువులో సైతం వ్యవసాయం పుష్కలంగా సాగడానికి సూక్ష్మసేద్యం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసుకునేలా బిందు, తుంపర్ల సేద్య(డ్రిప్, స్ప్రింక్లర్) పరికరాలు రైతులకు అందజేసేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించింది. బహిరంగ విపణిలో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయకుండా ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై సూక్ష్మ సేద్యం పరికరాలు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆర్బీకేల్లో ప్రారంభమైంది. మైక్రో ఇరిగేషన్ ప్రక్రియను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**2023–24 లక్ష్యాలిలా...**

జిల్లాలో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. మెట్ట ప్రాంతంలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరం ఉంది. ఈ ఏడాది మండలంలో 200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం ప్రోత్సహించాలని మైక్రోఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. మైక్రోఇరిగేషన్ పరికరాలు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, సర్వే, బిందు, తుంపర సేద్య పరికరాల బిగింపు తదితర అంశాలను రైతుభరోసా కేంద్రాల్లోని ఉద్యాన సహాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ లక్ష్యంలో భాగంగా సైదాపురం మండంలో ఇప్పటికే 123.62 హెక్టార్లలో సూక్ష్మసేద్యం పరికరాలు అమర్చుకునేందుకు 99 మంది రైతులు పేర్లను ఆర్బీకేల్లో నమోదు చేయించారు.

**5 ఎకరాల్లోపు 90 శాతం**

ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఐదెకరాల కంటే ఎక్కువగా విస్తీర్ణం ఉన్న రైతులకు గరిష్ఠం 12.50 ఎకరాల వరకు రాయితీ పరికరాలు పొందవచ్చు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 12.50 ఎకరాలపైన రైతులకు 50 శాతం రాయితీ వర్తింప చేస్తారు. ఆపైన భూమి ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తారు. రైతు భరోసా కేంద్రాన్ని సంప్రందించి వివరాలు నమోదు చేసుకోవాలి. డాక్యుమెంటేషన్ కంపెనీలే చేస్తాయి. రైతు వాటా కింద చెల్లించే నగదు ఫోన్‌పే ద్వారా మైక్రో ఇరిగేషన్ సంస్థకు చెల్లించవచ్చు.

**రైతులు ఏమి చేయాలంటే..**

బిందు, తుంపర్ల సేద్య పరికరాలు పొందాలకున్న రైతులు ఆధార్‌కార్డు, మీభూమిలో వన్‌బీ, బ్యాంకు పాసుపుస్తకం జెరాక్స్ కాపీలు ఆర్బీకేల్లో ఇస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. అనంతరం ఫీల్డ్ విజిట్ చేసి, అర్హత ఉంటే మంజూరు చేస్తారు. రైతులకు విద్యుత్ సదుపాయం, బోరు తప్పనిసరిగా ఉండాలి.

**డ్రిప్ ఉపయోగాలు..**

- పంట ఆధారంగా 30 నుంచి 70 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు.ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చు.
- పొలంలో ఉన్న మొక్కలన్నింటికీ సమానంగా నీరు అంది పెరుగుదలలో వ్యత్యాసాన్ని నివారించే వీలుంటుంది.
- పంట సాగులో వేధించే కలుపు సమస్యలను అరికట్టే వెసులుబాటు కలుగుతుంది.
- నీటి ద్వారా ఎరువులు సరఫరా చేస్తుండడంతో పెరుగుదలకు అనుగుణంగా పోషకాలు అందుతాయి.
- ఏక కాలంలో పంట కోతకు వస్తుంది.
- 40 శాతం విద్యుత్ ఆదా అవుతుంది.
- కూలీల ఖర్చులు తగ్గుతాయి.
- పంటలకు చీడపీడలు, పురుగు సమస్య తగ్గుతుంది. ఎత్తు పల్లాలుగా ఉన్న నేలల్లో సైతం నీటి సరఫరా సులభతరం అవుతుంది. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరానికి 20 నుంచి 30 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

**అపరాలకూ స్ప్రింక్లర్లు**

ఆపరాల, గడ్డిసాగు చేసుకునే రైతులకు కూడా సబ్సిడీపై స్ప్రింక్లర్లు ఇస్తారు. 5 ఎకరాల్లోపు 50 శాతం..ఆపైన భూమి ఉన్న వారికి 45శాతం సబ్సిడీ ఇస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలతో లాభసాటి వ్యవసాయం చేయవచ్చు. చిన్న, సన్న కారు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బిందు, తుంపర సేద్యం చేయాలనుకునే రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో అధికారులను సంప్రందించి, తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ పథకానికి గడువు ఏమీ లేదు.



– బి. శ్రీనివాసులు, మైక్రో ఇరిగేన్ అధికారి, నెల్లూరు

## స్పందన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం



అర్జీ స్వీకరిస్తున్న 14వ వార్డు కౌన్సిలర్ ఏ శంకరయ్య

**వెంకటగిరి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సంబంధించిన పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని 14వ వార్డు కౌన్సిలర్ ఏ శంకరయ్య తెలిపారు. ఈ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే స్పందన అర్జీలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు సచివాలయ పరిధిలోని 14, 15 వార్డులో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం లబ్ధిదారులతో కౌన్సిలర్ ఆరిశంకరయ్య, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద తదితరులు సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదోవిడత నిధులు ఈనెల 21వ తేదీన లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయనున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత సంక్షేమం అందుతుందని తెలిపారు.

## 19న రైతు బజార్ ప్రారంభం

**గూడూరురూరల్:** పట్టణంలో నూతనంగా నిర్మించిన రైతుబజార్‌ను ఈనెల 19వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.1.15 కోట్లతో అన్ని వసతులతో పట్టణ నడిబొడ్డున నిర్మించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే వేగవంతం చేయాలి

**ఓజిలి:** భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూసర్వే–భూరక్ష కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ శివరామసుబ్బయ్య అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా అర్జీదారులు నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొంటున్న భూసమస్యలను వీఆర్వోలు గ్రామాల్లోనే పరిష్కరించాలన్నారు. సర్వే నంబర్ 302లో 150 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, పట్టాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ముమ్మాయిపాళెం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు, తహసీల్దార్‌శివరామసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. అలాగే వీర్లగునపాడులో రీసర్వేపై గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, వీఆర్వో డిల్లెయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

**గూడూరురూరల్:** పట్టణంలోని 30వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును సోమవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన వలంటీర్ ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడం అభినందనీయమన్నారు. వలంటీర్లు గొప్ప సేవ చేస్తుంటే పవన్ కల్యాణ్ వలంటీర్లపై అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ జనరంజక పాలన అందిస్తూ దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ గురవయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, నాయకులు కే నారాయణరెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## విహారయాత్రను తలపించిన బస్సుయాత్ర

**దొరవారిసత్రం:** మండలంలో సోమవారం టీడీపీ నాయకులు చేపట్టిన బస్సుయాత్ర విహారయాత్రను తలపించింది. ఈ బస్సుయాత్రకు గ్రామాల్లో స్పందన కరువు కావడంతో సమస్యలు చెప్పాల్సిందిగా కొన్ని చోట్ల నేతలు హడావుడి చేయడం గమనార్హం. నాయుడుపేట నుంచి డీవీ సత్రం మండలం నేతాజీనగర్ సమీపంలోని ఇసుక రీచ్ వద్ద నాయకులు సెల్ఫీ కార్యక్రమం చేపట్టారు. అక్కడ నుంచి మావిళ్లపాడు గ్రామం మీదుగా వీఎంఆర్ నగర్, తనియాలి గ్రామం, ఎస్టీ కాలనీ, కమ్మకండ్రిగ గ్రామాల వరకు యాత్ర కొనసాగించారు. సాయంత్రం తనియాలి గ్రామంలో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్ సుబ్రమణ్యం, పరసా రత్నం, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వీ సతీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా గుంత



రోడ్డు పక్కన గుంత

**ఓజిలి:** మండలంలోని మానమాల సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డుపై ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. నాలుగు నెలలు కిందట రైతులు చెరువుకు తెలుగుగంగ నీరు తీసుకొచ్చారు. చెరువులో తూము నుంచి నీరు బయటకు వచ్చే ప్రాంతంలో నీటి ప్రవాహ వరవడికి కల్వర్టు వద్ద రోడ్డు పక్కన గుంత ఏర్పడింది. ఈ మార్గంతో ఓజిలి నుంచి కోట, వాకాడు మండలాలకు అధికంగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి రోడ్డు పక్కన గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## స్వచ్ఛందంగా ముందుకు వచ్చి...



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓవైపు క్లోరినేషన్, మరోవైపు హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి చేయిస్తున్న వలంటీర్లు(ఫైల్)

**దొరవారిసత్రం:** ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎవరూ కరోనా వైరస్ బారిన పడకూడదనే తలంపుతో ఏకొల్లు గ్రామానికి చెందిన పలువురు వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో క్లోరినేషన్ చేయించారు. మండల కేంద్రమైన దొరవారిసత్రంలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయం లోపల, వెలుపల ఓ వైపు బ్లీచింగ్ చల్లడంతోపాటు హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. క్రమం తప్పకుండా వారాని కోసారి తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీ, ఎమ్మార్సీ తదితర కార్యాలయాలన్నింటిలో క్లోరినేషన్ చేసి సహాయక చర్యలు చేపట్టారు.

**వలంటీర్లు సేవ మరువలేనిది**

కరోనా సమయంలో పలువురు వలంటీర్లు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో క్లోరినేషన్ చేయించి, కరోనా వైరస్ సోకకుండా ఎంతో మేలు చేశారు. అప్పట్లో వారి చేసిన సేవలు మరువలేనవి. పలువురు కరోనా బారిన పడి ఉన్నారనే విషయం తెలిసి కూడా ఎంతో ధైర్యంగా వలంటీర్లు ముందుకు వచ్చి పోలీస్‌స్టేషన్ లోపల, ఆవరణలో బ్లీచింగ్ చల్లి వైరస్ ప్రబలకుండా సహాయ చర్యలు చేపట్టారు.



– ఎంబేటి నాగార్జున, పోలీస్ కానిస్టేబుల్, డీవీ సత్రం

## సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్కామ్యాంగో స్పెషల్, ఆర్కాసిట్రస్ స్పెషల్ ట్రైకోడెర్మాను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త గోవిందరాజులు

**వెంకటగిరిరూరల్:** రైతుల ప్రయోజనార్థం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందజేస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక కేవీకేలో సోమవారం రైతులకు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 95వ వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో సులువైన పద్ధతులు, విధానంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రైతులకు ఆర్కా మ్యాంగో స్పెషల్, ఆర్కాసిట్రస్ స్పెషల్ ట్రైకోడెర్మాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పి నాగార్జునరెడ్డి, ఐ రాజీవన, విజయశ్రీ, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజలు చేసి శవాన్ని పూడ్చారని ఆందోళన



క్షుద్ర పూజలు చేసిన ప్రాంతాన్ని పోలీసులకు చూపుతున్న గ్రామస్తులు

**చిల్లకూరు:** చింతవరం నడిబొడ్డున ఉన్న రాజుగారి కోట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి, శవాన్ని పూడ్చి పెట్టారని గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని చింతవరం గ్రామంలో ఉన్న రాజుకోట ప్రాంతంలోకి ఎవరు వెళ్లరు. అక్కడంతా నిర్మానుష్యంగా ఉండే చోట మూడు అడుగుల గుంత తవ్వి, అక్కడ పూజలు చేసినట్లు నిమ్మకాయలు, కుంకుమ, పసుపు, దుస్తులు ఉండడంతో అటుగా వెళ్లిన వారు వాటిని చూసి ఆందోళన చెందుతూ గ్రామస్తులకు విషయం తెలియజేశారు. దీంతో గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంత మంది పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని గ్రామస్తులకు ధైర్యం చెప్పిపూడ్చి పెట్టిన చోట మళ్లీ తవ్వి అక్కడ ఏమి లేక పోవడంతో గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

## నేడు మద్దెలమడుగు సెంటర్‌లో సురక్ష

**రాపూరు:** మండలంలోని రాపూరుబిట్–3(మద్దెల మడుగు సెంటర్‌లోని)సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. లబ్ధిదారులకు అసరమైన 11 రకాల సేవలను ఈకార్యక్రమం ద్వారా ఉచితం అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుసకోవాలని కోరారు.

**సోనియాగాంధీనగర్‌లో..**

**సూళ్లూరుపేట:** మున్సిపాలిటీలోని సోనియాగాం, దీనగర్ సచివాలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నామని కమిషనర్ నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సమస్యలున్న వారు వచ్చి అందుకు తగిన సర్టిఫికెట్లను అందుకోవాలని కోరారు.

**జగనన్న సురక్షను విజయవంతం చేయాలి**

**ఓజిలి:** మండలంలోని గ్రద్దగుంట సచివాలయంలో మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ధ్రువీకరణపత్రాలను ఆయా పంచాయతీల సర్పంచ్‌లతో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు.

## నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

**సూళ్లూరుపేట:** పట్టణంలోని శేషసాయి కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ కే ప్రసన్నకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కే రామమోహన్‌రావు, ఎల్ఎల్ ఆంజనేయకుమార్, జీ ఈశ్వరమ్మ ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్నారని పేర్కొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణం

**దొరవారిసత్రం:** మండలంలోని తల్లంపాడు ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం పథకం కింద మంజూరైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. గతంలో రోడ్డు వసతి లేక కాలనీ వాసులు ఇక్కట్లు పడేవారు. ఎస్సీ కాలనీలో సుమారు 130 మీటర్లు పొడవున సిమెంట్ రోడ్డు నిర్మించడంతో రెండు వీధుల్లో అంతర్గత రోడ్డు సమస్య తీరిందని సర్పంచ్ వీణ, కాలనీ వాసులు తెలిపారు.

## సీఎం సభను విజయవంతం చేయండి






కోట: మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి , గూడూరురూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి

**కోట:** వెంకటగిరిలో ఈ నెల 21వ తేదీన జరగనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో ఆయన, తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలసి గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి గూడూరు డివిజన్‌కు మొదటిసారిగా వస్తున్నారన్నారు. వెంకటగిరి సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సీఎం సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ బాధ్యత అప్పగించిన నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి నిబద్ధతతో చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యల్లసిరి గోపాల్‌రెడ్డి, కే ధనుంజయరెడ్డి, ఎస్ వినోద్‌కుమార్ రెడ్డి, కే హరిశ్చంద్రారెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, మీరారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, ఎస్ నాగులు, మనోజ్‌రెడ్డి, వాకాడు జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, కోట ఎంపీపీ అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**సీఎం సభను జయప్రదం చేయండి**

**గూడూరురూరల్:** వెంకటగిరికి ఈ నెల 21వ తేదీన జరగనున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గూడూరులోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 22 పథకాల ద్వారా రూ.2.40 వేల కోట్ల నగదును అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభకు గూడూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం హోదాలో గూడూరు సమీపంలోని వెంకటగిరి ప్రాంతానికి తొలిసారిగా వస్తున్నందున ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధిక సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కే మీరారెడ్డి, బీ విజయకుమార్, ఏఎంసీ చైర్ పర్సన్ ఓ యమునమ్మ, వీ కుమారస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మంజుల, ఏఎంసీ వైస్ చైర్మన్ కే గోవర్ధన్, డీ కృష్ణారెడ్డి, బాల కృష్ణారెడ్డి, కృష్ణయ్య, ఈ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అర్జీలకు అధిక ప్రాధాన్యత



సమస్యలనువింటున్న తహసీల్దార్

**సైదాపురం:** 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తహసీల్దార్ ఎస్ శ్రీనివాసులు అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమక్షంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఈ భాస్కర్, ఏఓ శివకుమార్, మండల వ్యవసాయాధికారి హైమావతి, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి విద్యుత్ స్తంభాన్ని సర్వే చేయాలి



జియోట్యాగింగ్ చేస్తున్న అధికారులు

**సైదాపురం:** ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్లే ప్రతి స్తంభాన్ని సర్వే చేయాలని ట్రాన్స్‌కో ఏఈ శేషాద్రి తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలో సోమవారం జీఐఎస్ఓ సర్వే కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జీఐఎస్ఓ సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. మండలం మొత్తం మీద ఈ సర్వే చేస్తున్నట్లు అన్నారు. ప్రతి విద్యుత్ స్తంభానికి జియో ట్యాకింగ్ చేసి యాప్‌లో నమోదు చేస్తామన్నారు.

### ఎస్సీలకు ఉపాధి పనుల కల్పన



కొత్తపల్లి చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న కాలనీ వాసులు

**దొరవారిసత్రం:** కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన పలువురు కూలీలకు అధికారులు ఉపాధి హామీ పనులు కల్పించారు. ఉపాధి సిబ్బంది తమకు పనులు కల్పించడంలేదంటూ ఇటీవల సచివాలయానికి తలుపులు వేసి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఎంపీడీఓ సింగయ్య, ఏపీఓ విజయ్‌భాస్కర్ సోమవారం కొత్తపల్లి ఎస్సీకాలనీకి చెందిన కూలీలకు చెరువు పూడికతీత పనులను కల్పించారు. అలాగే కూలీల నగదు గోల్‌మాల్‌పై కూడా రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

### పాఠశాలలకు స్మార్ట్ టీవీలు



ఎమ్మార్సీకి చేరిన స్మార్ట్ టీవీలు

**చిల్లకూరు:** సర్కారు పాఠశాలలకు ప్రభుత్వం స్మార్ట్ టీవీలు మంజూరు చేసిందని, అవి మండల కేంద్రానికి చేరాయని ఎంఈఓ సనత్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మార్సీలో మాట్లాడుతూ డిజిటల్ క్లాస్‌లు నిర్వహించేందుకు ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. వీరు ఆయా పాఠశాలలో ఆన్‌లైన్ తరగతులు చేపట్టి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. ఇందుకుగాను మండలంలోని ఏడు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ టీవీలను అమర్చనున్నట్లు చెప్పారు.

### శాకాంబరిదేవిగా పర్వతవర్ధినిదేవి



**రాపూరు:** మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో ఉన్న పర్వతవర్ధని దేవి సోమవారం శాకాంరిదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఆషాఢ అమావస్యను పురస్కరించుకుని అమ్మవారికి ఉదయం అభిషేకం, కుంకుమార్చన సేవ నిర్వహించామన్నారు. సాయంత్రం వివిధ రకాల పచ్చికూరగాయలతో శాకాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### కోనకు నిషేధిత పదార్థాలను తీసుకురావొద్దు

**రాపూరు:** మండలంలోని పెంచలకోనకు దేవస్థానం అధికారులు, పోలీసులు నిషేధించిన పదార్థాలను తీసుకురావద్దని ఈఓ జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో భక్తులను కోరారు. దేవస్థాన పరిసరాల్లో మద్యం, ధూమపానం, మాంసం, గుట్కా, పాన్‌పరాగ్ తదితర మత్తు పదార్థాలను నిషేదించారని, వీటిని భక్తులు ఇక్కడకు తీసుకురావద్దన్నారు. దేవస్థానం పవిత్రతను ప్రతి ఒక్కరు కాపాడాలన్నారు.